ప్రజాశక్తి
సోమవారం 1 ఏప్రిల్ 2024



అంబులెన్స్‌లో ప్రసవం

-తల్లీ బిడ్డ క్షేమం

ప్రజాశక్తి -అనంతగిరి: పురిటి నొప్పులతో బాధ పడుతున్న గర్భిణీని అంబులెన్స్‌లో ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవం జరిగినట్లు 108 అంబులెన్స్ సిబ్బంది రమేష్, మూర్తిలు తెలిపారు. బూడీ గ్రామానికి చెందిన జన్ని సన్యాసమ్మను ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా కాశీపట్నం కొత్తమ్మ తల్లి గుడి సమీపం వద్ద పాప జన్మించిందని తెలిపారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని, ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.



బిడ్డను చూపుతున్న ఇఎన్‌టి

గిరిజనం..సమస్యలతో సతమతం

- రోడ్డు సౌకర్యం లేక అవస్థలు
- గెడ్డనీరే ఆధారం
- పట్టించుకోని పాలకులు



కాలినడకన వెళుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు మగ్గుతున్నాయి. మౌలిక సదుపాయాలు అందని ద్రాక్షగా మిగిలాయి. మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వం మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప అభివృద్ధికి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.



నీటిని మోసుకొస్తున్న గిరిజనులు

అనంతగిరి మండలం మారుమూల పినకోట పంచాయతీ పరిధి పందిరిమామిడివలసలో 20, కుటుబలు, కరిమామిడిలో 12 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు రోడ్డు, తాగునీటి, గృహాలు వంటి సౌకర్యాల అందక ఆయా గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీస రోడ్డు సౌకర్యం లేక కొండకోనల నుండి సుమారు 8 కిలోమీటర్ల దూరం కాలి నడకన గిరిజనులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అనారోగ్యం బారిన పడినప్పుడు రోగులు, గర్భిణిలపే డోలీ సహాయంతో వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక పోవడంతో నిత్యావసర సరుకులను భుజంపై మోసుకుంటూ దట్టమైన అటవీ ప్రాంతం కొండ కోనల నడుచుకుంటూ గ్రామాలకు వెళ్తున్నారు. అటవీ ప్రాంతం గుండా రాకపోకలు చేస్తుండటంతో ఏ సమయంలో అటవీ జంతువులు దాడి చేస్తాయోనని భయంతో బిక్కుమంటూ గిరిజనులు రాక పోకలు సాగిస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేక గిరిజనులు కలుషితమైన ఊటగెడ్డ నీటిని ఆశ్రయిస్తున్నారు.



గెడ్డలో నీటిని మోసుకొస్తున్న గిరిజన మహిళలు

వసతులు లేక ఇబ్బందులు

తమ గ్రామాలకు ప్రభుత్వ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. వైస్సార్ గృహాలు, తాగునీటి వంటి పథకాలు నేటి వరకు అందలేదు. ఈ మధ్యకాలంలో అరకొరగా పైపులైన్ ఏర్పాటు చేశారు. ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదు. అమ్మ ఒడి, ఫించన్, రైతు భరోసా వంటి పథకాలు పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో, గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

గెమ్మెల. ఈశ్వరరావు,
కరిమాడి పిన్నకోట పంచాయతీ

రోడ్డు సౌకర్యం లేక కాలిబాటే దిక్కు

తమ గ్రామానికి కనీసం రోడ్డు సదుపాయం ప్రభుత్వం కల్పించలేదు. దీంతో తాము అనారోగ్యాలకు గురైనప్పుడు డోలీ మోతలతో వైద్యం కోసం తరలిస్తున్నాం. సరుకులు భుజంపై మూసుకుంటూ అడవీ మార్గం గూడా నడుచుకుంటూ వెళ్ళవలసి వస్తుంది. పందిరిమామిడి, కరిమామిడి మీదుగా బొర్రాపల్లెం మెయిన్ రోడ్డు 8 కిలోమీటర్లు వరకూ రోడ్డు సౌకర్యం లేదు.

చింత సోంనాయుడు
పందిరి మామిడి వలస. పిన్నకోట

నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం

● సిపిఎం సమావేశంలో నేతల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత సీతారామయ్య

ప్రజాశక్తి- కూనవరం : పోలవరం ముంపు భూములకు ప్యాకేజీ ఇవ్వాలని. సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు..ే ంపాక గ్రామంలో పార్టీ జనరల్ బాడీ సమావేశంలో మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల వ్యవసాయ భూములు మునుగుతున్నా, కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. 70 శాతం ప్రాజెక్టు తామే కట్టామని టిడిపి ఈ ప్రాంతీయులను మోసపుచ్చిందన్నారు. ఏటా వచ్చే గోదావరి,శబరి వరదలకు నాలుగు నెలల పాటు ముంపు బాధలతోప్రజలు అల్లాడుతున్నా స్పందించే దిక్కులేకపోవడం శోచనీయమన్నారు. పంటలను నష్టపోయిన నిర్వాసిత రైతులను ఆదుకునే చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. నిర్వాసితులను, గిరిజనులను మోసం చేస్తున్న పాలక పార్టీలను వచ్చే ఎన్నికలో పోలవరం ప్రాజెక్టులో ముంచాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎం.నాగమణి, బి.బొర్రయ్య, ఎం.జోగయ్య, ఎం.బొజ్జి, లక్ష్మయ్య పాల్గొన్నారు

ఉపాధి కల్పనలో రాజవొమ్మంగి టాప్

● నియోజకవర్గ స్థాయిలో మొదటిస్థానం



ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఎపిఒ సురేష్ కుమార్.

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : మండలంలోని 19 గ్రామపంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు కల్పనలో రాజవొమ్మంగి మండలం రంపచోడవరం నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలిచిందని ఉపాధి హామీ పథకం ఎపిఒ సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి పనులను పర్యవేక్షించారు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎపిఒ సురేష్‌కుమార్ మాట్లాడుతూ, మండలంలో 8,400 కుటుంబాలకు జాబుకార్డులు ఉండగా, అందులో మూడు వేల కుటుంబాలకు పైబడి ఇప్పటికే వంద రోజులు పని కల్పించామన్నారు. ఉపాధి హామీ పథకం చరిత్రలో మార్చి నెలాఖరు నాటికి మండలంలో మొదటిసారిగా 6,54,047 పని దినాలు కల్పించి, ఏడాదికి సగటున 77.48 రోజులు ఉపాధి పనులను కల్పించినట్లు తెలిపారు. మండలంలో ఉపాధి కూలీలకు ఈ ఏడాది.రూ15.84 కోట్లను ఉపాధి కూలీల వేతనాలుగా వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు.ఉపాధి పనుల్లో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు, ఉపాధి కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు చెల్లించాలి

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర, జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : ఏజెన్సీలో పండుతున్న చింతపండు, అల్లం, పసుపు, కాఫీ, మిరియాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని తూటంగి పంచాయితీ బల్లకట్టు గ్రామంలో ఆదివారం వారు సందర్శించి చింత పండు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజనులు పండిస్తున్న చింత పండుకు కేజీకి రూ.60లు ఇవ్వాలన్నారు.సీపీఎం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో అక్కడి ముఖ్యమంత్రి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇస్తున్నారన్నారు. ఇక్కడ మాత్రం వైసీపీ, టీడీపీ పార్టీలు ఎవరు అధికారంలో ఉన్నా వ్యాపారులతో కుమ్మక్కై, గిట్టుబాటు ధరలు రైతులకు ఇవ్వలేదనీ విమర్శించారు.

సీపీఎం పార్టీకి ఓటేసి గెలిపిస్తేనే పంటలకు గిట్టుబాటు ధరలు సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులకు అటవీ ఉత్పత్తులను కనీస మద్దతు ధర కల్పించడంలో వైఫల్యం చెందాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, మండల నాయకులు సింహాచలం, రాజు, మధు పాల్గొన్నారు.



చింతపండును పరిశీలిస్తున్న సురేంద్ర, గంగరాజు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ నేతల ప్రచారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఆదివాసులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఆదివాసి రాష్ట్ర చైర్పర్సన్, అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ పి.శాంతకుమారి తెలిపారు. మండలంలోని కించుమండ పంచాయతీ కుసుమవలస గ్రామంలో ఆదివారం ఆమె సందర్శించి గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేనతో పాటు వైసిపితో గిరిజనులకు పెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీలకు ఓటు హక్కుతో గిరిజనులు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.చిన్నస్వామి, భీమారావు, పండన్న, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యా పరికరాలను ఇస్తున్న సిఆర్‌పిఫ్ పోలీసులు

పాఠశాలను తీర్చిదిద్దిన సిఆర్‌పిఎఫ్ పోలీసులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని నుర్మతి పంచాయతీ గాదిగుంట గ్రామంలో పాఠశాల భవనం మరమతు పనులను స్థానిక పోలీస్ స్టేషన్, సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్‌కు చెందిన పోలీసులు చేపట్టారు. స్కూల్‌ను దత్తత తీసుకొని సొంత డబ్బులతో పాత భవనాన్ని మరమ్మతు చేపట్టి కొత్త భవనంగా తీర్చిదిద్దారు. స్కూల్లో విద్యార్థులకు కావలసిన పూర్తి పరికరాలను అందుబాటులోకి తీసుకు వచ్చి పూర్తిస్థాయిలో విద్యార్థులకు చదువుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించారు. దీంతో ఆ గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గ్రామస్తులందరూ పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఐజి చారుశీల, 198 బెటాలియన్ కమాండర్ రాజేష్ పాండే, నర్మతి అవుట్ పోస్ట్ అసిస్టెంట్ కమాండర్ బి.ఉదయ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్సై శ్రీనివాస్, సిఆర్పిఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి

సిపిఎం అభ్యర్థులనే గెలిపించండి

ప్రజాశక్తి-ఎటపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ కోరారు. ఆదివారం విస్సాపురం పంచాయతీ జగ్గవరంలో వలస ఆదివాసీ గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఆదివాసి గ్రామాల్లో అభివృద్ధి చేసింది సిపిఎం అని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రత్యక్షంగా పరోక్షంగా ఆ సమస్య పరిష్కారం చూపించేది సిపిఎం మాత్రమేనన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో ప్రజల పట్ల చూపిన అంకిత భావానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం చేసిన కృషిని గుర్తుపెట్టుకుని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సిపిఎం అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థించారు. కుంజా బొజ్జి, సున్నం రాజయ్యలు ఎమ్మెల్యేలుగా చేసిన అభివృద్ధి తప్ప, గడచిన పదేళ్ల కాలంలో అభివృద్ధి జరగలేదన్నారు. వైసిపి, టిడిపిలకు ఆదివాసీల సమస్యలు పట్టవన్నారు. ఆదివాసీల సమస్యలపై ఆయా పార్టీలు ఏనాడూ పోరాడింది లేదన్నారు. ఎన్నికల రాగానే ఓట్ల కోసం మళ్ళీ గ్రామాలకు వస్తారని, ఎన్నికలు అయిపోగానే ప్రజల మొహాలు తిరిగి చూడరన్నారు. అలాంటి వారికి ఓటడిగే హక్కు లేదని అన్నారు. సిపిఎం అభ్యర్థులు గెలిపిస్తేనే నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటు పడతారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరావు, ఇరపా అజయ్, ఆకిశెట్టి రాము, సోందే రామారావు, సోయం వీరమ్మ, జి హుస్సేన్, పర్సిక ధర్మరాజు, రవి, భీమయ్య, శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

రేయింబవళ్లు విద్యుత్ వెలుగులు

నాలుగైదు నెలలుగా ఆరని వీధి దీపాలు
అధికారుల నిరక్ష్యంపై నిరసనల వెల్లువ

ప్రజాశక్తి -సీలేరు: విద్యుదుత్పత్తి కేంద్రం సీలేరులోనే ఉందనే సంకేతమో, లేకుంటే ఎంత వృథా అయితే మనకేంటిలే అన్న నిర్లక్ష్యమో తెలియదుగానీ, జీకే వీధి మండలం సీలేరు మేదిరి పంచాయతీ చింతపల్లి క్యాంపులోనూ, సీలేరు మెయిన్ రోడ్డు తదితర ప్రదేశాల్లో వీధిలైట్లు రేయింబవళ్లు వెలుగుతూ సంబంధిత శాఖాధికారుల నిర్వాకం, నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఒకటి రెండు రోజులు కాదు.. ఏకంగా నాలుగైదు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొనడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు విద్యుత్ ఆదా చేయండని ప్రకటనలు చేస్తూనే, మరోవైపు ఇలా, ఇంత నిర్లక్ష్యంగా విద్యుత్‌ను వృథా చేయడమేంటని పలువురు ప్రశ్నించారు. వేసవిలో మైదాన, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలతో ప్రజలు అల్లాడుతుంటే, ఇక్కడ ఇంతగావిద్యుత్‌ను వృథా చేయడమేంటని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత ట్రాన్స్‌కో అధికారులుగానీ, గ్రామపంచాయతీగానీ తమకేమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని పలువురు తప్పు పడుతున్నారు. విద్యుత్ కేబుల్‌లో సాంకేతికపరమైన సమస్యల వల్లే ఇటువంటి సమస్యలు తలెత్తుతోందని స్థానిక లైన్‌మ్యాన్ అంటున్నారు. అయితే ఈ సమస్య పరిష్కారానికి మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రేయింబవళ్లు వెలుగుతున్న వీధిదీపాలను క్రమబద్ధీకరించడం ద్వారా విద్యుత్ వృథాను అరికట్టాలను ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



చింతపల్లి క్యాంపులో పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

వెలగని వీధిదీపాలతో అవస్థలు

ప్రజాశక్తి -చింతూరు : మండలంలోని చట్టి గ్రామపంచాయతీ ప్రధాన రహదారిలో కొన్ని నెలలుగా వీధిలైట్లు వెలగక పోవడంతో అంధకారం నెలకొంది. వాహన దారులు ప్రజలు అనేకసార్లు ప్రమాదాలకు గురైనారు. జాతీయ రహదారి 30ని ఆనుకొని ఉన్న ప్రధాన రాష్ట్ర రహదారిలో నిత్యం అంతర్రాష్ట్ర వాహనాలు, భారీ కంటైనర్లు తిరుగుతుంటాయి. రోడ్డుపై రాత్రి వేళ గేదెలు గుంపులుగా సంచరిస్తుండటంతో వాహన దారులకు కనిపించక ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయి. దీనిపై పంచాయతీ సెక్రటరీకి, సంబంధిత అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా కనీస స్పందన లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సచివాలయ అధికారులు స్పందించి తక్షణమే వీధిలైట్లను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని స్థానికులు అంటున్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

శిఖర గ్రామాల గిరిజనానికి పోలీసుల సూచన



కిండంగి గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ రఘునాథ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని గిరిజనులకు పోలీసులు సూచించారు. ఆదివారం మండలంలోని లోదొడ్డి పంచాయతీ శిఖరప్రాంత కిండంగి గ్రామాన్ని రాజవొమ్మంగి సిఐ ఎన్.సన్యాసినాయుడు, జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆ గ్రామాన్ని సందర్శించి, గిరిజనులతో ముచ్చటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, గిరిజనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు,

ఈ సందర్భంగా రాజవొమ్మంగి సిఐ ఎన్ సన్యాసినాయుడు మాట్లాడుతూ, గంజాయి, నాటుసారా అక్రమ రవాణా, అమ్మకాలు చట్టరీత్యా నేరమని, వాటి జోలికి పోయి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనుమతి, లైసెన్స్ లేకుండా ఆయుధాలు కలిగి ఉండడమూ నేరమేనని, ఎవరివద్దనైనా నాటుతుపాకులు, తపంచాలు వుంటే ఇప్పటికైనా స్వచ్ఛందంగా అప్పగించాలని సూచించారు. గిరిజనులు ముఖ్యంగా యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు, గ్రామంలోని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపణి చేసారు, ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు పలు సమస్యలను పోలీసులకు విన్నవించారు. గ్రామంలో విద్యుత్ సరఫరా, రహదారి వంటి సమస్యను విన్నవించగా, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పోలీసులు భరోసానిచ్చారు.

సిపిఎం కార్యకర్త మృతి

-బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆ పార్టీ నేతలు

ప్రజాశక్తి-విఆర్.పురం: మండలంలోని ముద్దులగూడెం గ్రామానికి చెందిన సిపిఎం కార్యకర్త సోడి పెద్ద మల్లయ్య ఆదివారం ఇంటి వద్ద మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం నేతలు ముద్దులగూడెం గ్రామాన్ని సందర్శించి, మల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపాన్ని తెలిపారు. మల్లయ్య మృతదేహానికి నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పునేం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, సోడి మల్లయ్య. కుంజ కన్నయ్య, కుర్సం రమణయ్య. సోడి. శ్రీరామమూర్తి పాల్గొన్నారు



మల్లయ్య మృతదేహానికి నివాళు లర్పిస్తున్న సిపిఎం నేతలు, కార్యకర్తలు

దోపిడీ లక్ష్యంగా వైసిపి పాలన

మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-గొలుగొండ:దోపిడి లక్ష్యంగా వైసీపీ పాలన కొనసాగిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామంలో ఆదివారం ఎన్నికల శంఖారావం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ,ఎన్నికల ముందు మద్య నిషేదం అని చెప్పి తీరా అధికారంలోకి వచ్చి మద్యంపై వ్యాపారం చేశారన్నారు. మద్యం దుకాణాలను తాకట్టు పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులను మోసం చేశారన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోవడం సిగ్గు చేటన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్నారు. ఇంటిలో చదువుకున్న పిల్లలు ఎంతమంది ఉన్నా అందరికీ సంవత్సరానికి 15 వేలు, ప్రతి ఇంటికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అప్పలనాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, సీనియర్ నాయకులు సాంబమూర్తి, అదపురెడ్డి గోపాలకృష్ణ, బెల్లపు కొండలరావు, గెడ్డం ఆనంద్, నర్సింపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:ఎన్నికల్లో ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి సూచించారు. ఆదివారం కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎల్‌పురం, కొంకసింగి, నాగాపురం, పాతకృష్ణదేవిపేట, చోద్యం తదితర గ్రామాల్లో ఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవిపేట ఎస్సై ఎం.ఉపేంద్ర ఉన్నారు.

తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:వేసవి కాలం దృష్ట్యా రక్షిత మంచినీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని రావికమతం మండలం కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి కోరారు. కవగుంట పంచాయతీ శివారు బుద్ధిబంద గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని అధికారుల సహకారంతో మరమ్మతులు చేపట్టామన్నారు. తరచూ మరమ్మత్తుకు గురవడంతో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. పంచాయితీలో నిధులు లేని కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను సొంత డబ్బులతో మరమ్మతులు చేపట్ట వలసిన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, రవి, శంకర్రావు, వీరభద్ర రాజు, శ్రీను పాల్గొన్నారు.

'నర్సీపట్నంలో అభివృద్ధి పనులు ఏవీ'

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో ఎమ్మెల్యే గణేష్ ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోగా ప్రతిపక్ష నాయకులను విమర్శిస్తూ ఐదేళ్లు కాలయాపన చేశారని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. ఆదివారం నర్సీపట్నంలో కృష్ణాపేలస్‌లో జనసేన పార్టీ బూత్ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, ఏరియా ఆసుపత్రిలో కనీసం లిఫ్ట్ బాగు చేయలేకపోయారన్నారు. సెల్ ఫోన్ల వెలుగులో ఆపరేషన్లు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రబ్బర్ మ్యాట్స్ అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నింజాస్ అకాడమీ సుమారు 50వేల విలువ 45 స్పోర్ట్స్ మ్యాట్స్ ఛైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్స్ సుతాపల్లి బ్రదర్స్ శ్రావణ్, శ్రీకాంత్ క్రీడాకారులకు అందజేసినట్లు డైరెక్టర్స్ పారుపల్లి శ్రీనివాస్, రుత్తల రమా తెలిపారు. వీటిని వూషు సీనియర్ కోచ్ శేఖర్, వేపాడ ప్రియాంక క్రీడాకారులకు అందజేశారు. అకాడమీ ఛైర్మన్ వెలగా నారాయణరావు మాట్లాడుతూ, నర్సీపట్నం నుండి ఉషు కుస్తీ పోటీలకు ఎంతో మంది నేషనల్‌కు వెళుతున్నారని తెలిపారు. 6 నెలల నుండి మ్యాట్స్‌పై స్పాన్సర్ కోసం వెళ్లామని, చివరకు తామే ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



రోగులకు రొట్టెలు ఇస్తున్న వైద్య సేవకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు టౌన్: ఈస్టర్ పర్వదినాన్ని అల్లూరి జిల్లాలో క్రైస్తవులు ఆదివారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోని సిబిఎం చర్చ్, వెస్ట్ ఐ గాడ్ చర్చ్, ద లార్డ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్, జెసి కమెనెంట్, కల్వరి బాప్టిస్ట్ చర్చ్, సీయోను ప్రార్థన మందిరం, చర్చ్ ఆఫ్ ద లివింగ్ గాడ్ ఫెలోషిప్, అగాపే, బేతని ప్రార్థన మందిరాలలో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. పాడేరు పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ విద్యాసాగర్, చిక్కాల బాబూరావు, జాషువా, డేవిడ్, సాల్మన్, డానియేల్, మత్స్యరాజు, యోబు, పాపిబాబు, జోషి పాల్, యుసేబియ సహోదరులు ఎస్.కళ్యాణం, ప్రధాన కార్యదర్శి స్టీవెన్ శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

హుకుంపేట:స్థానిక పరిశుద్ధ థామస్ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపించారు. క్రీస్తు బోధనలను స్థానిక పాస్టర్ కె.జేమ్స్ బోధించారు. యేసు క్రీస్తు సిలువలో చూపించిన ప్రేమ, త్యాగం ప్రతి క్రైస్తవ సోదరులు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వాసులు బుజ్జిబాబు, తిమోతి, ఆనంద్, రాజు, హరి, ఏసుపాదం, హనోక్, ప్రసాద్, హర్ష, కొర్నేలి పాల్గొన్నారు.

విఆర్.పురం: మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్ సండే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సంతపాకలలోని చర్చిలో ఏసుక్రీస్తు పునరుత్థానోత్సవం సందర్భంగా క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్ ఆధ్వర్యంలో క్రీస్తు బోధనలను వివరించారు. శిలువపై మరణించిన ఏసుక్రీస్తు మూడు రోజుల తర్వాత సమాధి నుంచి పునర్జీవం పొంది, ప్రజలకు శాంతిసందేశాన్ని అందించారన్నారు.తర్వాత ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. యూసిబిఎం, గేస్సమనే తదితర చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యూసిబిఎం చర్చి సమీపంలో ఉన్న క్రైస్తవుల శ్మశానవాటికి వెళ్లి సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి పాస్టర్ మన్నె ఆధ్వర్యాన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులంతా పరస్పరం ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



క్రీస్తు బోధనలను వివరిస్తున్న పాస్టర్ డేవిడ్



ప్రార్థన చేస్తున్న మహిళలు

సిపిఎం నేతకు పరామర్శ

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని గత్తుం పంచాయితీ దుర్గం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన జన్ని పండన్న మృతదేహానికి ఆదివారం సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజులు నివాళులర్పించారు. కుటుంబం సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, పార్టీ నాయకులు బొంజుబాబు గత్తుం పంచాయితీలో పోరాటం చేసి పలు సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషి చేశారన్నారు. జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, పలు గ్రామాలకు సరైన రోడ్లు లేవన్నారు. అనారోగ్యంతో బాధపడితే 108 అంబులెన్స్ రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నివాళి అర్పించిన వారిలో హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, మండల నాయకులు కొర్ర ఆనంద్, ఎస్ రాజు, మధు, శివశంకర్ బాబు, కామేష్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న కిల్లో సురేంద్ర, గంగరాజు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి-పాడేరు:రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన వివరాలు..పాడేరు మండలం సంతగండు వద్ద శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ మేడూరు గ్రామానికి చెందిన కొర్రా చిరంజీవి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చిరంజీవి స్నేహితుడు శంకర్ పాడేరుకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మరో ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి కాలు విరిగి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్ కు తలించారు. మృతులు ఇరువురు విశాఖలో ఏ.వి.ఎన్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. పాడేరు ఎస్సై లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ యాతపేట కాలనీలో ఆదివారం దల్లి నారాయణరెడ్డి (40) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... యాతపేటకు చెందిన దల్లి లీలావతి పెద్ద కుమారుడు దల్లి నారాయణరెడ్డి (40) భార్య భార్గవితో మనస్పర్ధలు కారణంగా రెండేళ్ల నుంచి వేరువేరుగా ఉంటున్నారు. నారాయణరెడ్డికి ముగ్గురు సంతానం ఉన్నారు. ఇద్దరు పిల్లలు భార్గవి దగ్గర, ఒక కుమారుడు నారాయణరెడ్డి దగ్గర ఉంటున్నారు. నారాయణరెడ్డి బ్యాటరీ వెహికల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం తల్లి లీలావతి రక్త పరీక్షల కోసం బయటికి వెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో ఉన్న నారాయణరెడ్డి బెల్టు సహాయంతో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లీలావతి ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-చీడికాడ:మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు ...చీడికాడ మండలం సిరిజం గ్రామానికి చెందిన విశారపు గణేష్ (19) ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గణేష్, తల్లిదండ్రుల మధ్య తరచూ గొడవలతో యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

క్వారీ లారీల సామగ్రి అపహరణ

ప్రజాశక్తి -కొత్తకోట:సీజ్ చేసిన క్వారీ లారీల సామగ్రి దొంగల పాలైన సంఘటన రావికమతం మండలం దొండపూడి ఫారెస్ట్ ఠాణా వద్ద చోటు చేసుకుంది. అధికారులంతా ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉండగా దొంగలు తమ చేతివాటం చూపించి సుమారు రూ.5 లక్షల విలువైన వాహనాలకు చెందిన టైర్లు, ఖరీదైన బ్యాటరీలు, ఇంజన్ సామాన్లు గత కొన్ని రోజులుగా తస్కరిస్తున్నారు. రావికమతం మండలం చీమలపాడు శివారు అజయ్ పురం గ్రామ సమీపంలో ఒంగోలుకు చెందిన ఓ గ్రానైట్ కంపెనీ ఫారెస్ట్‌కు సంబంధించిన భూమిలో తప్పుడు అనుమతులతో గనులను తరలించక పోతున్నారంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడేళ్ల కిందట సుమారు ఐదు భారీ వాహనాలను దొండపూడి ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను స్థానిక ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఆ వాహనాలకు సంబంధించిన స్పేర్ పార్టులను రాత్రి వేళల్లో దొండపూడికి చెందిన వ్యక్తితో పాటు చోడవరం, కే కోటపాడు గ్రామాలకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు వాహనాలకు సంబంధించిన సామగ్రిని అపహరించినట్లు సమాచారం అందడంతో కొత్తకోట పోలీసులు విచారణ చేపట్టారు. కె.కోటపాడుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచా రం.

త్వరలో పూర్తి వివరాలు: ఎస్ఐ

ఈ విషయమై కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావును వివరణ కోరగా.. ఈ ఘటన పై కోటపాడుకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు చెప్పారు. దొండపూడికి చెందిన మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్టు సమాచారం ఉందన్నారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడి చేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.



దగ్ధమవుతున్న మామిడితోట

పదెకరాల మామిడి తోట దగ్ధం

- రూ.ఏడు లక్షల ఆస్తి నష్టం : లబోదిబోమంటున్న రైతు

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని పోతనపల్లి గ్రామంలో చింతూరుకు చెందిన సయ్యద్ ఆసిఫ్ అనే వ్యక్తికి చెందిన పది ఎకరాల మామిడి తోట ఆదివారం మధ్యాహ్నం దగ్ధమైంది. ఎంతోకాలంగా కష్టించి నీరు పోసి రూ.లక్షల పెట్టుబడి పెట్టి పెంచిన తోట, ఫల సాయం అందే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.ప్రమాదవశాత్తు చీపురు గడ్డికి అంటుకున్న నిప్పు రాజుకుని, .పది ఎకరాల పంట కళ్ళ ఎదుట కాలిపోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో బాధిత రైతు ఉండిపోయాడు. అందిన సమాచారం స్థానిక యువకులకు చేరడంతో మోటార్ బైకులపై వెళ్లి నిప్పును ఆర్పే ప్రయత్నం చేసినారు. ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో మరింత నష్టం వాటిల్లిందని స్థానికులు అంటున్నారు. గతవారం మండలంలోని మల్లెతోట గ్రామంలో కూడా ఆదివాసీలకు చెందిన ఏడు ఇల్లు దగ్ధయ్యాయి. తరచూ అగ్ని ప్రమాదాలు జరిగి ప్రజల ఆస్తులు బుగ్గిపాలౌతున్నా, అగ్నిమాపక వాహనం అందుబాటులో లేకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. చింతూరు డివిజన్ కేంద్రంలో అగ్నిమాపక శకటాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్ఐగా నాగరాజు బాధ్యతలు

ప్రజాశక్తి- విఆర్.పురం: విఆర్.పురం ఎస్ఐగా కె.నాగరాజు అధివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కాగా కొత్త ఎస్ఐ నాగరాజు, గతంలో స్పెషల్ బ్రాంచ్, సిఐడి విభాగాల్లో పనిచేశారు.

అడవులు బూడిదౌతున్నా పట్టదా?

- ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యంపై సిపిఎం ఎంపిటిసి బుజ్జిబాబు మండిపాటు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధిలో అడవులు కాలి బూడిదవుతుంటే సంబంధిత అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం గాలికొండ ఎంపిటిసి ఎ.బుజ్జిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడవలసిన అధికారులుఅడవి సంపద కాళీ బూడిదవుతుంటే ఎటువంటి చర్యలు చేపట్టలేదని విచారం వ్యక్తం చేశారు. మారుమూల పివిటిజి గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పనకు చెట్ల కొమ్మలకు తొలగించాల్సి వస్తే ఆగమేఘాల మీద వచ్చి అడ్డంకులు సృష్టిస్తున్న అటవీశాఖ అధికారులు, ఇలా అడవులు కాలి బూడిదవుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా స్పందించి, అడవులన్నీ అగ్నికి ఆహుతి కాకుంటా పరిరక్షణ చర్యలు చేపట్టాలని బుజ్జిబాబు డిమాండ్ చేశారు.

వంద మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో వంద మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరాన్ని రామకృష్ణ మఠం కార్యాలయ ఇన్‌ఛార్జి స్వామి వేదవిద్యానంద మహారాజ్ పర్యవేక్షించారు. వైద్యశిబిరంలో డాక్టర్ దాసరి ఉమమహేష్. డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్. సంపత్‌కుమార్ పాల్గొని రోగులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. 50మందికి రక్తపరీక్షలు, ఎనిమిది మందికి థైరాయిడ్ పరీక్షలు, నలుగురికి ఫిజియోథెరపీ, ఆరుగురికి ఎక్స్‌రే పరీక్షల చేసినట్లు స్వామీజీ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని, స్వామీజీ కోరారు. శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు, .రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

10 నాటు తుపాకులు అప్పగింత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఆదివారం పది నాటు తుపాకులను అప్పగించినట్లు రాజ వొమ్మంగి సిఐ ఎన్ సన్యాసినాయుడు తెలిపారు, అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ ఆడహళ్లి ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐలు అనుమతుల్లేని నాటుతుపాకులను స్వచ్ఛందంగా అప్పగించాలన్న పిలుపు మేరకు గిరిజనులు స్పందిస్తు న్నారు. ఆదివారం జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలో మారేడుబాక గ్రామంలో నాలుగు నాటుతుపాకులు, వంచంగి, ఒకుర్తి గ్రామాల నుంచి మూడు నాటుతుపాకులను స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేసినట్లు సీఐ తెలిపారు,అలాగే రాజవొమ్మంగి పోలీసుస్టేషన్ పరిధిలో లక్కవరప్పాడు గ్రామం నుండి రెండు తుపాకులు అప్పగించారు. మండలంలో ఇప్పటివరకు మండలంలో 25 నాటు తుపాకులను స్వచ్ఛందంగా డిపాజిట్ చేసినట్లు తెలిపారు, మండలంలో ఇంకా ఎవరైనా నాటుతుపాకులు, లైసెన్స్ లేని తుపాకులను స్వచ్ఛందగా డిపాజిట్ చేయాలని కోరారు తర్వాత చేపట్టే తనిఖీల్లో పట్టుబడితే భారతీయ ఆయుధాల చట్టం ప్రకారం కేసులు, చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు ఎస్ వెంకయ్య, రఘునాధరావు, సిబ్బంది ఉన్నారు.



తుపాకులను చూపుతున్న పోలీసులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

అదుపు తప్పి గోతిలోకి దూసుకుపోయిన బొలెరో

ప్రజాశక్తి- చింతూరు : మండల కేంద్రంలోని శబరి బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు వద్ద ఆదివారం మధ్యాహ్నం చట్టి నుండి చింతూరు వైపుకు వస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుపై నుండి కిందకు దూసుకుపోయింది సుమారు 20 అడుగుల లోతుకు వాహనం వెళ్లిపోయినా ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సూటూరు గ్రామానికి చెందిన పూరి రామయ్యకు చెందిన వాహనం ఈ ప్రమాదానికి గురైంది స్థానికుల సహకారంతో ట్రాక్టర్‌తో బొలెరో వాహనాన్ని ప్రధాన రహదారిపైకి ఎక్కించారు.

శ్రీమన్నారాయణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రంపచోడవరం : గంగవరం తహశీల్దార్‌గా, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిగా ఎం శ్రీమన్నారాయణ అందించిన సేవలు అభినందనీయమని రంపచోడవం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గొనారే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ అన్నారు. 37ఏళ్లపాటు రెవిన్యూ శాఖలో సేవలందించి, ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన శ్రీమన్నారాయణను స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, గంగవరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ నిర్వహించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ సేవలను ఐటిడిఎ పిఒ, సబ్‌కలెక్టర్, ఇతర అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో డివిజినల్ సర్వే ఇన్‌స్పెక్టర్ ,దేవేంద్రుడు,. రంపచోడవరం గంగవరం తమశీల్దార్లు కృష్ణజ్యోతి, సత్య సులోచన, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయిరతన్, డిప్యూటీ తాసిల్దార్లు శ్రీధర్ వీరభద్రరావు రాంబాబు పాల్గొన్నారు, రెవెన్యూ ఉద్యోగులు తరపున . ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి ఫయూజ్ భాషా నూతన వస్త్రాలు, సన్మాన పత్రం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. మారేడుమిల్లి రాజవొమ్మంగి దేవీపట్నం తహశీల్దార్లు, గంగవరంఒ రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.



శ్రీమన్నారాయణను సత్కరిస్తున్న పిఒ, సబ్‌కలెక్టర్

అదుపు తప్పి బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి - మోతుగూడెం చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పి పడి పోవడంతో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. గోకవరం మండలం తిరుమల పాలెం గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరావు (45) చింతూరు చుట్టూ ప్రక్కల ప్రాంతంలో బైక్‌పై ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం మోతుగూడెం పరిసర ప్రాంతంలో ఐస్ క్రీమ్‌లను విక్రయించి, తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళు తుండగా బైక్ అదుపుతప్పి స్కిడ్ కావడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు.. మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వారపు సంతకు అమ్మకానికి తెచ్చిన పుచ్చకాయలు

జోరుగా పుచ్చకాయల విక్రయాలు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు ఆదివారం వారపుసంతలో పుచ్చకాయలు విరివిగా విక్రయాలు జరిగాయి. వేసవి తాపానికి తాళలేక మారుమూల నుంచి వచ్చిన గిరిజనులతో పాటు స్థానిక ప్రజలు పుచ్చకాయలు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్ పరిసర ప్రాంతాల్లో ఒడిశా గిరిజన రైతులు పుచ్చకాయలను విరివిగా పండిస్తారు. వాటిని పొలాల నుంచే వాహనాల్లో మైదాన ప్రాంతాలకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు అలాగే సీలేరు వారపుసంతకు తీసుకొచ్చి గిరిజన రైతులు విక్రయాలు జరుపుతుంటారు. ఆదివారం సీలేరు వారపు సంతలో ఒడిశా వాసులు తీసుకొచ్చిన పుచ్చకాయలకు భలే గిరాకీ లభించింది. గత వారం రోజుల నుంచి సీలేరు పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో, ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి వీటి రేట్లు కొంచం అధికంగా ఉన్నా కొనేందుకు ప్రజలు వెనకాడలేదు.

విహారయాత్రలో విషాదం

- పొల్లూరు జలపాతంలో పడి వ్యక్తి దుర్మరణం

- మృతుడు రంగంపేట లిక్కర్ ఫ్యాక్టరీ ఉద్యోగి

ప్రజాశక్తి - మోతుగూడెం: మన్యంలో ప్రకృతి అందాలను తిలకించేందుకు, వేసవిలో ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు వచ్చిన విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పొల్లూరు జలపాతం వద్ద ప్రమాదవశాత్తు జారిపడి ఒక వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి. రంగంపేట మండలంలోని లిక్కర్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మిత్రులంతా ఆదివారం సెలవు రోజున మన్యంలో అందాలను తిలకించేందుకు విహారయాత్రకు వచ్చారు. సాయిదుర్గ ట్రావెల్ బస్సులో మోతుగూడెంలోని పోల్లూరు జలపాతం వద్దకు 25 మంది స్నేహితులు విహారయాత్ర కోసం వచ్చారు. జలపాతం అందాలను తిలకించే క్రమం రంగంపేట మండలం కోటపాడు గ్రామానికి చెందిన వై కొండయ్య (33) ప్రమాదవశాత్తు కాలుజారి జలపాతంలో పడిపోయాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న కొండయ్యను తోటి స్నేహితులు హుటాహుటిన ఎపి జెన్‌కో ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ స్వర్ణ భార్గవ్ సిపిఆర్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కొండయ్య మృతితో విహారయాత్రకు వచ్చిన స్నేహితులంతా విషాదంలో మునిగిపోయారు. అందిన సమాచారం మేరకు మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు ఘటనపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అభయ లింగేశ్వరుని వార్షికోత్సవం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం నిమ్మలపాలెం గ్రామంలో అభయ లింగేశ్వర ఆలయం ఏడవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సన్నిధానంలో అన్నసమారాధన నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ధర్మకర్త మామిడి నాగేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2023-24 ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి విశాఖ పోర్టు సరికొత్త రికార్డును నెలకొల్పిందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాజా రవాణా రికార్డు ద్వారా గత ఏడాది చేసిన 73.75 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును తిరగరాసినట్టు పేర్కొన్నారు. ఈ రికార్డు విశాఖపట్నం పోర్టు సామర్థ్యాన్ని తెలియజేస్తోందని తెలిపారు.